రోడ్డు స్థలం ఆక్రమణ పట్టించుకోని అధికారులు

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు కొంతం మల్లారెడ్డి

రవీంద్రభారతి,ఆగస్టు 30 : తమ ప్లాట్‌లోకి రాకుండా అడ్డుగా రోడ్డుపై గుణంగారి రమణారెడ్డి అనే వ్యక్తి అక్రమంగా ప్రహరీగోడ నిర్మించారని, ఈ విషయంలో అతడికి సహకరిస్తున్న హయత్‌నగర్ బీజేపీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డిపై వెంటనే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి బాధితుడు కొంతం మల్లారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొంతం మల్లారెడ్డి మాట్లాడుతూ.. వనస్థలిపురం,హూడా సాయి నగర్‌లోని తమ ప్లాట్ లైన్‌లో హుడా లేఅవుట్ ప్రకారం 30 ఫీట్లు ఉన్న రోడ్డును గుణంగారి రమణారెడ్డి అక్రమంగా ఆక్రమించి దారికి అడ్డంగా ప్రహరీగోడ నిర్మించారని ఆరోపించారు.దీనిపై పలుమార్లు ఎల్బీనగర్ జోన్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్,జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో హైకోర్టును ఆశ్రయించడంతో అన్ని డాక్యుమెంట్స్ పరిశీలించి నాలుగు వారాల్లో అక్రమంగా నిర్మించిన ప్రహరీగోడను తొలగిస్తామని ఆర్డర్ కాపి ఇచ్చారని, అయినప్పటికీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ పావని, అధికారులు ఆ ఆర్డర్ కాపీని బేఖాతర్ చేస్తున్నారని ఆరోపించారు.

అజ్మీర్ దర్గాలో నాంపల్లి ఎమ్మెల్యే ప్రార్థనలు

ఉత్తర్‌ప్రదేశ్ ఆగ్రా సమీపంలో ఉన్న అజ్మీర్ దర్గాలో నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకు ముందు ఖాజా బందే నవాజ్‌కు చాదర్‌ను సమర్పించారు.
– మెహిదీపట్నం ఆగస్టు 30

గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ పెంచాలి

కర పత్రాన్ని ఆవిష్కరిస్తున్న భూక్యా సంజీవ్ నాయక్

చిక్కడపల్లి,ఆగస్టు 30 : గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలని సేవాలాల్ సేన తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్ డిమాండ్ చేశారు. సేవాలాల్ సేన 10 ఆవిర్భావ సందర్భంగా గిరిజన రిజర్వేషన్లను రక్షించాలనే డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 9న ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో సింహగర్జన నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సేవాలాల్ సేన రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో సింహగర్జనకు సంబంధించిన కరపత్రాన్ని శ్రీరామ్‌రామ్ మహారాజ్ తో కలిసి సంజీవ్ నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజీవ్ నాయక్ మాట్లాడుతూ.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ పెంచారని చెప్పారు. దీనిని కొంత మంది ఓర్వలేక కోర్టుకు వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జీవో నెంబర్ 33 ద్వారా అమలు అవుతున్న 10 శాతం రిజర్వేషన్ కాపాడాకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ సింహగర్జన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సైదానాయక్, రాజేశ్ నాయక్, శంకర్ నాయక్, ఎర్రం శ్రీను నాయక్, గ్రేటర్ అధ్యక్షుడు కల్యాన్ నాయక్, గోవర్ధన్ నాయక్, గణపతి నాయక్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియా దవాఖాన నిర్మాణ నిర్ణయానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

జనవాసాల మధ్య గోషామహల్ పోలీస్ స్టేడియం స్థలంలో ఉస్మానియా దవాఖాన నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎ వినోద్ యాదవ్, కోటి శైలేష్ కురుమలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గోషామహల్‌తో పాటు పలు ప్రాంతాలలో ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఇరుకు రహదారులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు దవాఖాన నిర్మించడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖానను నిర్మించాలని నిర్ణయించడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో దత్తు, అశోక్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.– అబిడ్స్

బృంద నృత్యాలయం కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేసిన ఇండియన్ ఐడల్ సింగర్ కేశవ్‌రామ్

శాస్త్రీయ నృత్యాంశాల్లో చిన్నారులను ప్రోత్సహించాలి

తెలుగు యూనివర్సిటీ, ఆగస్టు 30 : శాస్త్రీయ నృత్య ఇనిస్ట్యూట్ బృంద నృత్యాలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ప్రముఖ నర్తకి, సంస్థ నిర్వాహకురాలు పి.ఎస్ ప్రియాంక శిష్య బృందం భారతీయ శాస్త్రీయ నృత్యరీతులను 5 సంవత్సరాల పిల్లలు మొదలు 20 ఏండ్ల వయస్సు కలిగిన యువత అద్భుత రీతిలో వేదికపై ప్రదర్శించి ఆహుతుల ప్రశంసలు అందుకున్నారు. అన్నమయ్య బాణీలు, దశావతారం వంటి నేపథ్యాలతో ఔత్సాహిక కళాకారులు ప్రదర్శించిన తీరు ఆహుతులను ఆకట్టుకున్నది. ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ ఐడల్ సింగర్ కేశవ్ రామ్ కళాకారులు పరిణతితో ప్రదర్శించిన అంశాలకు ముగ్ధులై అభినందించారు.

యువత తల్లిదండ్రులను గౌరవించాలి

తిరుమంగై ఆళ్వార్ దివ్య కథ కూచిపూడి నృత్యప్రదర్శన ఇస్తున్న కళాకారులు

రవీంద్రభారతి,ఆగస్టు 30 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ,శాంతి వసంతా ట్రస్టు హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శ్రీ వెంకట్ గాడేపల్లి రచన తిరుమంగై ఆళ్వార్ దివ్య కథ అనే కూచిపూడి నృత్య నాటక ప్రదర్శన ఆద్యంతం రవీంద్రభారతిలో రసవత్తరంగా సాగింగి.ఈ కార్యక్రమానికి శ్రీశ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం ఫీఠాధిపతులు, శ్రీ మదభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి,పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ కేఐ వరప్రసాద్‌రెడ్డిలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి తిరుమంగై ఆళ్వార్ దివ్య కథ కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రారంభించారు.అనంతరం శ్రీశ్రీశ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం ఫీఠాధిపతులు మాట్లాడుతూ యువత తల్లిదండ్రులను గౌరవించినప్పుడే దేశాన్ని గౌరవించిన వారవు తార న్నారు. తల్లిదండ్రులపై భక్తి ఉన్నప్పుడే అతనికి దేశంపై దేశభక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంగీత నృత్యకళాకారులు హాజరయ్యారు. నృత్యా న్ని రచించి నిర్మించిన వెంకట్ గాడేపల్లిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరా మ్, సాంస్కృతిక శాఖ సంస్థ అధ్యక్షుడు గొర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బురుజుగల్లి హనుమాన్ దేవాలయ నిర్మాణానికి శ్రీకారం

అంబర్‌పేట: కొనేండ్లుగా పెండింగ్‌లో ఉన్న అంబర్‌పేట బురుజుగల్లి హనుమాన్ దేవాలయ నిర్మాణానికి ఎట్టకేలకు ముందడుగు పడింది.అంబర్‌పేట హనుమాన్ దేవాలయ బాల బృందం ప్రతినిధులు శుక్రవారం గుడి పంతుళ్లతో జరిపిన చర్చలు ఫలించాయి.హనుమాన్ మందిర్ నిర్మాణానికి పురోహితులు ఒప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో బాల బృందం ప్రతినిధులు సంజీవచారి, శ్రీహరిగౌడ్,అరవింద్‌గౌడ్,సాయినాథ్‌యాదవ్,లచ్చయ్యగుప్త, రవీందర్‌రెడ్డి, పూర్ణచందర్,వేణుగోపాలచారి, శ్రవణ్‌ముదిరాజ్, బబ్లూ, శేఖర్, జి.ప్రశాంత్‌శర్మ,జి.సుభాశ్‌శర్మతో చర్చించారు. దీంతో ఆలయ నిర్మాణానికి ముందడుగు వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ,ఆగస్టు 30: తెలంగాణ రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.7 వేల కోట్ల ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కులగణన చేపట్టి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు కావస్తున్నా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరం గా మారిందని, వెంటనే బకాయిలను చెల్లిం చి, విద్యార్థులను ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

యతార్థ్‌కు చెక్కును అందజేస్తున్న డాక్టర్ గౌతంరావు, కార్పొరేటర్ ఉమారమేశ్‌యాదవ్ తదితరులు

కాచిగూడ,ఆగస్టు 30: పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు అన్నారు. బర్కత్‌పురకు చెందిన యతార్థ్‌కు కొంత కాలంగా ఆరోగ్యం బాగలేదు. కిషన్‌రెడ్డి చొరవతో శుక్రవారం యతార్థ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.60 వేల చెక్కును డాక్టర్ గౌతంరావు, కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతంరావు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, కృష్ణకుమార్, శశి, ప్రభ, క్షీర్‌సాగర్, అరవింద్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీల అభివృద్ధికి సంక్షేమ సంఘాలు కృషి చేయాలి

మెహిదీపట్నం ఆగస్టు 30 : బస్తీల అభివృద్ధికి సంక్షేమ సంఘాలు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శుక్రవారం లంగర్‌హౌస్ డివిజన్ హరిదాస్ పురా బస్తీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా బస్తీల సంక్షేమ సంఘాల వారు ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు బోగి మహేష్,కార్యదర్శి శ్రీకాంత్,నాయకులు జ్ఞానేశ్వర్, విజయ్ ఆనంద్, వినోద్,అంజిని కుమార్, జగన్, దేవరాజ్,అనిల్,విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నవలలు రాయడం అద్భుతం

మూడు నవలలు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాగర్ కె చంద్ర, ఏనుగు నరసింహారెడ్డి

రవీంద్రభారతి,ఆగస్టు 30: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహితీ వనం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ప్రముఖ రచయిత విజయ్ అప్పల్ల రచించిన మూడు నవలల ఆవిష్కరణ సభను ఘనంగా నిర్వహించారు.శాంతి కృష్ణ సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ దర్శకులు సాగర్ కె చంద్ర, విశిష్ట అతిథిగా సాహితీ వేత్త ఏనుగు నరసింహారెడ్డిలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి విజయ్ అప్పల్ల రచించిన మూడు నవలను ఆవిష్కరించారు.అనంతరం వక్తలు మాట్లాడుతూ విజయ్ చాలా అద్భుతమైన మూడు నవలను రాయడం సామన్యమైన విషయం కాదన్నారు.ఇంతమంచి నవలలను రచించిన విజయ్ అప్పల్లను ప్రశంసించారు.భవిష్యత్‌లో మరిన్ని మంచి పుస్తకాలను రాయాలని వారు ఆకాంక్షించారు. సన్నాఫ్ సుజాతరావ్ నవల,శ్రీ సత్యాజీ డీఎన్ఏ నవల,మానశ్రీ మల్లిక్ డిటెక్టివ్ అలెక్స్ నవలను వక్తలు పరిచయం చేశారు. అనంతరం విజయ్‌ను తెలుగు సాహితీవనం తరపున శాంతికృష్ణ, సుమన్ ప్రణవ్‌లు సన్మానించారు. ఈ పుస్తకాలు కావలనుకునే వారు ఈ నెంబర్‌కు 92474 46497 కాల్ చేయాలని విజయ్ విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్‌లో చేరికలు

మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో యూనియన్‌లో చేరుతున్న జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు, కార్మికులు

అబిడ్స్, ఆగస్టు 30 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ, కార్మిక రంగాలకు పూర్తి న్యాయం జరుగుతుందని మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంస్థ అయిన టువంటి మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్‌లో జీహెచ్‌ఎంసీలోని దాదాపు 200 మంది ఉద్యోగులు, కార్మికులు ఆదిల్ షరీఫ్ నేతృత్వంలో యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక హక్కులు కాపాడుతూ వారి అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సూపరిటెండెంట్ వై. యాదగిరి, టాక్స్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ గౌసుద్దీన్, వెంకటేష్, జి. శివ కుమార్, నరేందర్, హరి నివాస్, మమ్మద్ మొయిన్ పాల్గొన్నారు.

ప్రగతి మహా విద్యాలయాలో .. హనుమాన్‌టెక్డిలోని ప్రగతి మహా విద్యాలయంలో శుక్రవారం షీ టీమ్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏసీపీ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం మహిళలకు షీ టీమ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు. –సుల్తాన్‌బజార్

బాలగంగాధర్ తిలక్ సంస్మరణ సభ

చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా శుక్రవారం కవి, నవలా రచయిత దేవరకొండ బాలగంగాధర్ తిలక్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొని బాలగంగాధర్ తిలక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పొత్తూరి సుబ్బారావు, వండ్లకొండ వెంకటరావు, గరిమెల్ల సీతాదేవి పాల్గొన్నారు. –ముషీరాబాద్

ఎంఐఎం ఆధ్వర్యంలో.. నేడు జాబ్ మేళా

మెహిదీపట్నం ఆగస్టు 30 : కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్‌లోని లంగర్‌హౌస్ రింగ్‌రోడ్‌లో ఉన్న మహబూబ్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు పెద్ద ఎత్తున జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

2న ఇంజినీరింగ్ స్పాట్ అడ్మిషన్స్

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 30: ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు వచ్చే నెల 2వ తేదీన స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. బయోమెడికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. కళాశాలలోని అసెంబ్లీ హాల్‌లో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు స్పాట్ అడ్మిషన్స్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఒంటి గంట తరువాత వచ్చిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. విద్యార్థి ఒరిజినల్ టీసీ తీసుకొని వస్తేనే అడ్మిషన్‌కు అనుమతిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఇతర ఇంజినీరింగ్ కళాశాలలో సీట్లు తీసుకొని వారు మాత్రమే దీనికి అర్హులని అన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు అర్హులు కాదని పేర్కొన్నారు. ఈ కోటా కింద చేరే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదన్నారు.

డ్రైనేజీ సమస్య లేకుండా చర్యలు

అధికారులతో కలిసి డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్.

చిక్కడపల్లి,ఆగస్టు 30 : గాంధీనగర్ డివిజన్‌లో కాలనీలు, బస్తీల్లో నెలకొన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని టీఆర్టీ, జవహర్‌నగర్ పరిసరా ప్రాంతాల్లో సీవరేజ్ సమస్యలు తీవ్రంగా ఉందని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు శుక్రవారం కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్ రెడ్డి, మేనేజర్ కృష్ణ మోహన్‌లతో కలిసి అక్కడ పర్యటించి సమస్యను పరిష్కరించాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, సురేశ్, నవీన్‌కుమార్, దోనేటి సత్యం, ఆనంద్ రావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

విద్యార్థులకు మందులను పంపిణీ చేస్తున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆల పురుషోత్తం రావు

అబిడ్స్, ఆగస్టు 30 : ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆల పురుషోత్తంరావు కోరారు. ఆగాపురాలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆగాపురా యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమైరా సరీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బంది వందమంది నుంచి రక్త నమూనాలను సేకరించడంతో పాటు వారికి వైద్య సేవలను అందించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోత్స్న తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వరలక్ష్మీ వత్రం: శారద మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అశోక్‌నగర్‌లోని అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వత్రాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు ఎం.శేషమ్మ, కార్యదర్శి కృష్ణవేణి, ఉపాధ్యక్షురాలు లలిత, పూర్వ అధ్యక్షురాలు పద్మావతి పాల్గొన్నారు. చిక్కడపల్లి

కలీముద్దీన్ అహ్మద్ పదవీ విరమణ

విధి నిర్వహణలో ఉద్యోగంతో పాటు కుటుంబానికి సమన్యాయం చేస్తూ పదవీ విరమణ పొందడం ఎంతో అదృష్టమని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. తెలంగాణ వైద్య ఆరోగ్య గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలీముద్దీన్ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ 43 ఏండ్ల పాటు వివిధ విభాగాలలో ఎంతో ఓపికతో ఒక్క మెమో కూడా లేకుండా అధికారుల మన్ననలతో పదవీ విరమణ పొందడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఓ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు శ్యాం, కోశాధికారి ఉపేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. –సుల్తాన్‌బజార్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం ఆగస్టు 30 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ డిఫెన్స్ కాలనీ ఫీడర్,11 కేవీ హీరా ఖానా ఫీడర్,11 కేవీ అహ్మద్‌నగర్ ఓవర్‌హెడ్ ఫీడర్,11 కేవీ ఇలియాస్ రోడ్ ఫీడర్,11 కేవీ వీబీఆర్ ఫీడర్,11 కేవీ కులీకుతుబ్‌షా టూంబ్స్ ఫీడర్,11 కేవీ సాలెనగర్ ఫీడర్,11 కేవీ ఆదిత్యనగర్ ఓవర్‌హెడ్ ఫీడర్,11 కేవీ డీలక్స్ కాలనీ ఫీడర్ ప్రాంతాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో దొంగతనం

కాచిగూడ,ఆగస్టు 30: కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడి వద్ద నుంచి ఓ ఫోన్, రూ.5 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన పి.శేవవరణ్(53) వృత్తిరీత్యా సీఆర్‌ఫీఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్. ఈ నెల 22న కాచిగూడ–మధురై రైలుకు వెళ్లడానికి కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం–1లో పడుకున్నాడు.అనంతరం లేచి బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న సెల్‌ఫోన్,రూ.5 వేల నగదు, డెబిట్, ఆధార్‌కార్డు,హెల్త్‌కార్డును దొంగిలించారు. శుక్రవారం శేవవరణ్ కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మెహిదీపట్నం ఆగస్టు 30: అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని పోలీసులు చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించగా ఆ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...లంగర్‌హౌస్ హెచ్‌పీ పెట్రోల్ పంప్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

ప్రజల కోసం పోలీసులు నిరంతరం శ్రమిస్తూ ప్రశాంత జీవితాన్ని అందిస్తారని కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ కోరని సునీల్ అన్నారు. శుక్రవారం కార్వాన్ నియోజకవర్గం జియాగూడకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఇన్‌స్పెక్టర్ కోరని సునీల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావూరి వెంకటేష్,సి.బాబు,జడల మోహన్,శంకర్,ఛాయాదేవి ,సంతోష్ తదితరులు పాల్గొన్నారు. –ఆబిడ్స్ ఆగస్టు 30